భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

27, అక్టోబర్ 2026, మంగళవారం భారత్ సమాచార్

బాలికలకు పోక్సో చట్టంపై అవగాహన



భారత్ సమాచార్, మెదక్ జిల్లా: బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, లైంగిక వేధింపులకు పాల్పడటం వంటి నేరాలకు పాల్పడితే పోక్సో చట్టం ప్రకారం కఠిన శిక్షలు తప్పవని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ ఎం. హేమలత హెచ్చరించారు. బాలల భద్రత, హక్కులపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి ఎం. హేమలత విద్యార్థినులకు బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, చట్టపరమైన రక్షణపై వివరించారు.

ప్రతి బాలుడు, బాలిక భయం లేని వాతావరణంలో జీవించే హక్కు కలిగి ఉంటారని, ఎలాంటి అందోళన లేకుండా విద్యను అభ్యసిస్తూ తమ హక్కులను స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చని న్యాయమూర్తి తెలిపారు. బాలల హక్కులు, భద్రత, రక్షణ, సంక్షేమంపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

బాలలపై జరిగే హింస, లైంగిక వేధింపులు, లైంగిక దోపిడీ, ఇతర అనుచిత చర్యలను అరికట్టడంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ కీలక పాత్ర పోషించాలని చెప్పారు. ముఖ్యంగా బాలికల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు పాల్పడినా వాటిని తేలికగా తీసుకోకూడదని, ఇలాంటి నేరాలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్, వ్యక్తిగత భద్రత, లైంగిక వేధింపుల నివారణ, ఆన్‌లైన్ భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తమకు ఇబ్బందికరంగా అనిపించే పరిస్థితులు ఎదురైనా, ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా భయంతో మౌనంగా ఉండకూడదని న్యాయమూర్తి సూచించారు. వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు విషయం తెలియజేయాలని చెప్పారు.

బాలల రక్షణ కోసం అమల్లో ఉన్న చట్టాలు, వాటి ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా అందుబాటులో ఉండే ఉచిత న్యాయ సహాయంపై

కూడా అవగాహన కల్పించారు. చట్టపరమైన సమస్యలు ఎదురైనప్పుడు ఎక్కడ సహాయం పొందవచ్చో తెలుసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరమని తెలిపారు.

బాలల భద్రత కేవలం తల్లిదండ్రుల బాధ్యత మాత్రమే కాదని, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. బాలల హక్కులను గౌరవిస్తూ వారికి సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, లైంగిక వేధింపుల నివారణ, చట్టపరమైన రక్షణపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా న్యాయ సేవాధికార సంస్థ చర్యలు చేపట్టింది.

© 2026 Bharath Samachar